

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే బిగాల

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

- ఆరు గ్యారెంటీలతో హస్తం పార్టీ మభ్యపెట్టింది
- ఐదేండ్లలో జిల్లాకు అర్వింద్ చేసిందేమీలేదు..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆగ్రహం
- జిల్లా కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 11: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ఎంకే గార్డెన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వరికి రూ. 500 బోనస్ ఇస్తామన్న హామీని తుంగలోకి తొక్కిందన్నారు. తాగునీరు, విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్నే కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తున్నదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఎవరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ ఈ ఐదేండ్లలో జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. పసుపు బోర్డు పేరుతో ఎంపీగా గెలిచిన ఆయన మళ్లీ అదే పేరుతో గెలువాలని చూస్తున్నారని మండిపడ్డారు.

**కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీయాలి: బిగాల**

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల మాట్లాడుతూ.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాజిరెడ్డిని ఎంపీగా గెలిపించి ఢిల్లీలో మన గొంతును వినిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు సిర్ప రాజు, దారం సాయిలు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, ప్రభాకర్ రెడ్డి, ఎనుగందుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పోచారం

- అధికారులకు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం ఆదేశం
- బాన్సువాడ ఏరియా దవాఖాన పరిశీలన

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 11: ప్రభుత్వ దవాఖాన నూతన భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బాన్సువాడ పట్టణంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా బాన్సువాడ ఏరియా దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న దవాఖాన భవనం చాలా పాతదని తెలిపారు. దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి రూ.38 కోట్ల నిధుల మంజూరుతోపాటు అనుమతులు కూడా వచ్చినట్లు చెప్పారు. దవాఖానను ప్రస్తుత భవనం నుంచి ఇతర భవనంలోకి మార్చి వైద్య సేవలు అందించాలని సూచించారు. నూతన భవన నిర్మాణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలోపు బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తయితే ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం ఉన్న దవాఖానలో కొంతభాగం కూల్చివేసి మిగతా భాగంగా ఓపీ, డయాలసిస్ సేవలు కొనసాగేలా చూస్తామని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ వివరించారు. పోచారం వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్‌చైర్మన్ షేక్ జుబేర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దొడ్ల వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.




కామారెడ్డిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నిజామాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## ఘనంగా రంజాన్

- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు




బాన్సువాడలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోచారం



వేల్పూర్‌లో బాలుడిని ఆలింగనం చేసుకుంటున్న వేముల



నిజామాబాద్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాజిరెడ్డి, బిగాల



కామారెడ్డిలో ముజీబుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గంప గోవర్ధన్

**రంజాన్ వేడుకలను** ఉమ్మడి జిల్లాలో ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బాన్సువాడలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, వేల్పూర్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీలకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఫలించిన వేముల కృషి

- రైతులకు అండగా నిలిచిన మాజీ మంత్రి
- ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువకు నీటి విడుదల

ముప్కాల్, ఏప్రిల్ 11: ఎస్సారెస్పీ లక్ష్మి కాలువ ఆయకట్టు కింద యాసంగి పంటలకు సాగునీరు అందజేసి, రైతులను ఆదుకోవడానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన కృషి ఫలించింది. గురువారం అధికారులు ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాలువకు నీటి విడుదల చేపట్టారు. 0.3 టీఎంసీలు విడుదల చేయనున్నారు. ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా దిగువకు నిర్దేశించిన కేటాయింపులకు మించి నీటి విడుదల చేపట్టడం, కేటాయింపు ఉన్న లక్ష్మి కాలువకు నీటి అందించకపోవడంపై వేముల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని ప్రాజెక్టు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారితో ఫోన్ ద్వారా మాట్లాడారు. లక్ష్మి కాలువకు నీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. దీంతో గురువారం లక్ష్మికాలువకు నీటి విడుదల చేపట్టారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా ప్రతిరోజూ 400 క్యూసెక్కుల చొప్పున పదిరోజులపాటు నాలుగు టీఎంసీలు విడుదల చేయాలని వేముల కోరగా.. ప్రస్తుతం 0.3 టీఎంసీల నీటి విడుదల చేపట్టారు.

## బసవలింగ సంస్థాన్‌లో 'గాలి'

- పీఠాధిపతి సోమాయప్ప ఆశీర్వాదం తీసుకున్న అనిల్‌కుమార్

జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ బిచ్కుందలోని శ్రీ సద్గురు బసవలింగ సంస్థాన్ మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకొన్నారు. ఈ సందర్భంగా సోమాయప్పను గాలి అనిల్‌కుమార్ శాలువాతో సన్మానించారు. అనంతరం లోక్‌సభ ఎన్నికలపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే ఆధ్వర్యంలో చర్చించారు.

-బిచ్కుంద, ఏప్రిల్ 11



## సివిల్ సప్లయ్‌లో గందరగోళం!

**కామారెడ్డిలో డీఎం పోస్టు ఖాళీ**

- ఏఎస్‌వోకు ఇన్‌చార్జి బాధ్యతలు
- డీఎంను కేటాయించాలని సర్కారుకు కలెక్టర్ లేఖ
- కనీసం స్పందించని పౌర సరఫరాల కమిషనర్ చౌహాన్
- రాజకీయాలకే పరిమితమైన కాంగ్రెస్ పాలకులు



నిజామాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):

కామారెడ్డి పౌరసరఫరాల శాఖలో గందరగోళం చోటుచేసుకున్నది. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన వేళ మొన్నటి వరకు ఒకే అధికారికి రెండేసి పోస్టులను అప్పగించి చేతులు దులుపుకొన్నారు. ధాన్యం కొనుగోళ్లను మమ అనిపించేందుకు ప్రభుత్వం సిద్ధపడగా రెండేసి పోస్టులను నిర్వహించడం తనతో కుదరదని డీఎస్‌వో తేల్చిచెప్పారు. దీంతో డీఎస్‌వోను కాదని ఆయన కింద పనిచేసే ఏఎస్‌వోకు డీఎం పోస్టును అప్పగించారు. ఇన్‌చార్జీగా ఏఎస్‌వోకు అప్పగించినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత, వేగవంతమైన ప్రక్రియ జరగడం లేదు. అనుభవలేమి, సమన్వయ కొరత, సమయస్ఫూర్తి కొరవడడంతో ఒకడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా కామారెడ్డిలో ధాన్యం సేకరణ జరుగుతున్నది. పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థలో వేర్వేరుగా విధులు ఉంటాయి. డీఎస్‌వో, డీఎం పోస్టులకు సీనియార్టీ ప్రకారం అధికారుల కేటాయింపును ధాన్యం కొనుగోళ్లకు ముందే నియమించాల్సిన అవసరం ఉంటుంది. కానిక్కడ మాత్రం అదేమీ జరగలేదు.

**కలెక్టర్ లేఖకు స్పందన కరువు..**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముంచుకొస్తున్న నేపథ్యాన్ని గ్రహించి పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్‌కు మార్చి మొదటి వారంలో కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ లేఖ రాశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతాయని ముందస్తుగానే ప్రభుత్వానికి సూచన చేశారు. నెల రోజులవుతోన్నా సర్కారు నుంచి ఉలుకు పలుకు లేదు. స్వయానా కలెక్టరే లేఖ రాసినా ప్రభుత్వ స్థాయిలో చలనం లేకపోవడంపై ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. కామారెడ్డి జిల్లాకు పౌరసరఫరాల శాఖ అధికారిగా మల్లిఖార్జున్ పనిచేస్తున్నారు. సదరు అధికారి గతంలో చిన్నపాటి జిల్లాల్లో పనిచేశారు. అక్కడ ధాన్యం కొనుగోళ్లకు ప్రాధాన్యత తక్కువ. కామారెడ్డిలో లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యం రాకను దృష్టిలో పెట్టుకొని అనుభవజ్ఞులు అవసరం. సర్కారు నుంచి స్పందన కరువైన నేపథ్యంలో జిల్లా స్థాయిలో సర్దుబాట్లకు ఉన్నతాధికారులు ముందడుగు వేశారు. డీఎస్‌వో ససేమిరా అనడంతో ఏఎస్‌వోను ఇన్‌చార్జి డీఎంగా నియమించారు.

**సీఎంఆర్ రికవర్రీ..**

ధాన్యం కొనుగోళ్లు అనగానే రైతుల నుంచి మద్దతు ధరకు వడ్లను కొనడంతోనే సరిపోదు. సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు కేటాయింపులు జరపాలి. మర ఆడించిన ధాన్యాన్ని తిరిగి ఎఫ్‌సీఐకి అప్పగించే బాధ్యతలను పౌరసరఫరాల శాఖనే చూడాలి. మేనేజర్ లేకపోవడంతో ఇప్పుడున్న ఇన్‌చార్జి అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. మొత్తంగా పౌరసరఫరాల శాఖలో గందరగోళం, అయోమయంతో కిందిస్థాయి సిబ్బంది సైతం ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ఏ విధంగా ముగుస్తుందోనన్న ఆందోళన ఉన్నతాధికారులను వెంటాడుతున్నది.

**రాజకీయాలకే పరిమితం..**

కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత పాలకుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. ఇందుకు ధాన్యం కొనుగోళ్లలో వెలుగు చూస్తున్న వ్యవహారాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, లక్ష్మికాంతారావుతోపాటు ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ కొనసాగుతున్నప్పటికీ ఈ వ్యవహారంపై దృష్టి మాత్రం పెట్టలేదు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఉమ్మడి జిల్లాను గాలికి వదిలేశారు. మూడు వారాల క్రితం వడగళ్ల వానతో పంట నష్టపోయిన వారిని పరామర్శించి చేతులు దులుపుకొన్నారు.

## ఘనంగా పూలే జయంతి



వేల్పూర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేముల



కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ పాటిల్..



నిజామాబాద్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు..

వేల్పూర్/ కంఠేశ్వర్/ కామారెడ్డి, ఏప్రిల్ 11: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం ఎంతో కృషి చేశారని వేశారని పలువురు వక్తలు కొనియాడారు. కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సహాయ అధికారి యాదగిరి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,కార్యదర్శి సాయిలు తదితరులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా సమీకృత కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పూలమాల వేసి నివాళులర్పించారు.

**అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు..**

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలేనని మాజీ మంత్రి , ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కొనియాడారు. వేల్పూర్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ మొండి అశోక్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నగధర్, రేగుల్ల రాములు, దాసు, భోజన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.